

ఎంఎల్ఎ నాగేశ్వరరావును కలిసిన విఆర్ కోట నీటి సంఘం కమిటీ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గం లో ఇటీవల జరిగిన సాగునీటి సంఘ ఎన్నికల్లో విఆర్ కోట సప్లై ఛానల్ కమిటీ అధ్యక్షుడిగా ఆనందపురం గ్రామానికి రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా మోపాడు గ్రామానికి చెందిన తోకల మాల్యాద్రి ఎన్నికయ్యారు. బుధవారం టిడిపి కార్యాలయంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని కలసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆయకట్టు పరిధిలో రైతులకు మేలు చేసేందుకు కషి చేయాలని సూచించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వడ్డేవల్లి వెంకట్రావు, తల్లపనేని మురళీకష్ణ, రావుల రవి, పైనీడి వెంకటేశ్వర్లు ,కొచ్చర్ల మాధవరావు ఉన్నారు

ఎంఎల్ఎ ఇంటూరిని కలిసిన విఆర్‌కోట నీటి సంఘం కమిటీ బృందం

వెంకటగిరి రాజాలకు తప్పని తిప్పలు..!

వెంకటగిరి రాజాలు స్వాతంత్ర్యానికి పూర్వం మకుటం లేని మహరాజులు... ఆ ప్రాంతంలో వారు చెప్పిందే వేదం...వెంకటగిరి రాజాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు సాగాయి.. వేలాది ఎకరాలు భూమి వారి స్వాధీనంలో ఉండేది..రాజులు పోయారు. రాజరికం అంతరించిపోయింది. వెంకటగిరి ప్రాంతంలో రాజా కుటుంబం తన రాజభవనాన్ని అద్దెలకు ఇచ్చింది. జిల్లాలో వెంకటగిరి రాజాలు విఆర్ సంస్థల వంటి ఎన్నో కార్యక్రమాలు చేశారు...సైదాపురం మండలం, కలిచేడు వద్ద కళ్యాణ రామ మైనింగ్ పేరుతో మైకా గనులు సాగేవి. ఇదే వారికి ప్రస్తుత ఆదాయ వనరు.. ఎప్పటి నుంచో టిడిపిలో కొనసాగిన రాజాలు గత ఎన్నికల సమయంలో వైసిపిలో చేరారు..ఈ ప్రాంతంలో రాజా కుటుంబానికి ఉన్న బలంతో అనేక మంది విజయం సాధించారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి రాగానే కలిచేడు మైన్ లీజు దక్కించుకోడానికి ఆ కుటుంబం అనేక ప్రయత్నాలు చేస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది.

టిడిపి వర్గీయులకు చెందిన 9 మైన్స్‌కు అనుమతి - 27న మైన్స్ యజమానుల ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సైదాపురం తెల్లరాయి మైన్స్ విషయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇది కొంతమంది విషయమైనప్పటికీ అనేక మంది కూలీలు, కార్మికులు, మైన్స్ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా కూటమి ప్రభుత్వంలో నెలకొన్న విభేదాలతో ఎవరి మైన్స్ వారికే ఇచ్చేలా చూస్తున్నారనే ప్రచారం సాగింది. ఓ ప్రజాప్రతినిధి తనకు ఎలాంటి సంబందమూ లేదని ఎవరి మైన్స్ వారు చేసుకోవచ్చునని చెప్పారని తెలిసింది. ...గత ప్రభుత్వం చేసిన తప్పులనే మళ్లీ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. బయటకు ఒక మాట...లోపల మరో మాట అన్నట్లు సాగుతోంది మైనింగ్ వ్యవహారం. మనుబోలు వద్ద షెడ్లు నిర్మించి, మైనింగ్ యమానుల నుంచి తెల్లరాయి కొనుగోలు చేయనున్నట్లు తెలిసింది. వీరికి ఎవరు సరుకు ఇస్తారో వారికే మైన్స్ కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. వారం క్రితం మైనింగ్ యజమానులు ప్రజాప్రతినిధిని కలిసినప్పుడు ఎవరు మైన్స్ వారికే ఇస్తారని హామీ ఇచ్చినట్లు తెలిసింది. తీరా చూస్తే గతంలో వైసిపిలో ఉండి, ప్రస్తుతం టిడిపికి మద్దతుగా నిలిచిన తొమ్మిది మైన్స్ యజమానులకు లైసెన్స్‌లు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. సైదాపురం, గూడూరు, పొదలకూరు ప్రాంతంలో 170 మైన్స్ ఉన్నాయి. ఇందులో 130 మైన్స్ అన్ని అనుమతులుండగా, 40 మైన్స్ మాత్రం అటు, ఇటుగా చేసుకుంటుంది. ఇక్కడ నుంచి మైకా, పల్సపర్, క్వార్ట్జ్, వర్క్‌వైట్ తీస్తారు. ఏడాది వరకు వీటిని పెద్దగా ధరలు లేకపోగా ప్రస్తుతం భారీగా పెరిగిన విషయం తెలిసిందే..

సైదాపురంలో ఆరు నెలలుగా నిలిచిపోయిన మైన్స్ గనులు

వెంకటగిరి రాజాలకు ముప్పుతిప్పలు..!

వెంకటగిరి రాజాలకు సైదాపురం మండలం, కలిచేడు వద్ద కళ్యాణరామ మైన్స్ పేరుతో వందలాది ఎకరాల్లో మైన్స్ ఉన్నాయి. రాజకీయంగా టిడిపి నేతలతో విభేదించడంతో ప్రస్తుతం గనుల కోసం ధరఖాస్తు చేసుకున్నా వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఎవరికి ఇచ్చినా ఇవ్వకపోయినా రాజాలకు మైన్స్ దక్కకూడదనే ధోరణితో కొందరు నాయకులు వ్యవహరిస్తున్నారని సమాచారం. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని రాజాలు ఇప్పుడు తమ మైన్స్‌ను అనుమతులు తెచ్చుకోడానికి రాజధానిలో తిరుగుతున్నారు. ప్రస్తుతం రాజా కుటుంబం మైన్స్‌పైనే ఆధారపడింది. ఈ ప్రాంతంలో వేలాది మంది కూలీలు, కార్మికులు పనిచేస్తున్నారు. ఆర్నెల్ల నుంచి అనుమతులు రాకపోవడం, అసలు వస్తాయో, రావో తెలియకపోవడంతో రాజాలతోపాటు అక్కడ పనిచేసే కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది.

తొమ్మిది మైన్స్‌కు అనుమతి...?

సైదాపురం తెల్లరాయి మైన్స్ కేటాయింపుల విషయంలో ఆరు నెలలు గడిచినా ప్రభుత్వం ఏలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. వారికి ఇచ్చారు...వీరికిచ్చారు అంటూ ప్రచారం జరిగింది. ఎవరి మైన్స్ వారికే ఇస్తారని చెప్పడంతో కొందరు మైన్స్ యజమానులు సంబరపడ్డారు. తాజాగా గతంలో వైసిపిలో ఉండి, ప్రస్తుతం టిడిపిలోకి వచ్చిన ముగ్గురు నేతలకు చెందిన తొమ్మిది మైన్స్‌ను అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది. పొదలకూరు మండలం, ప్రభుగిరి పట్నం, జోగిపల్లి, చాకలికొండ, గిద్దలూరు, ప్రాంతాల్లోని మైన్స్‌కు సంబందించి గూడూరు ప్రాంతానికి చెందిన సురేష్‌రెడ్డికి చెందిన సాధన మినరల్స్ చెందిన ఆరు మైన్స్‌కు, సైదాపురంకు చెందిన కృష్ణంరాజు, జోగిపల్లికి చెందిన పి. గిరికి అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. అంతా గోప్యంగా సాగిస్తున్నట్లు తెలిసింది. మైన్స్ అదికారులు మాత్రం నోరు తెరవడం లేదు.

27న ప్రత్యేక భేటీ..!

టిడిపి ప్రభుత్వం వస్తే తమ బాధలు తీరుతాయని భావించిన మైన్స్ యజమానులు గత ప్రభుత్వం కంటే దారుణమైన స్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైన్స్ అనుమతులు ఇస్తారో లేదో తెలియకపోవడంతో ఆర్నెల్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 10 వేల మంది కార్మికులు, కూలీలకు పనులు లేకుండా పోయాయి. టిడిపి అనుకూలమైన వ్యక్తులకు, తమకు సరుకు అమ్ముతారనే వారికే అనుమతులు ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించిన మైన్స్ యజమానులు ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈనెల 27 చిల్లకూరు జాతీయ రహదారిలో ఉన్న ఎ5 హోటల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. పరిస్థితి ఇలానే ఉంటే ఏం చేయాలి, ఎలా ముందుకు వెళ్లాలనే విషయంపై చర్చించడానికి సిద్ధమవుతోన్నట్లు తెలిసింది. రోజుకో మలుపు తిరుగుతోన్న మైన్స్ వ్యవహారంలో ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాలి..

సిపిఎం సభ్యుడు బాణాల వెంకటేశ్వర్లు మృతి

నివాళి అర్పించిన నాయకులు

ప్రజాశక్తి -నెల్లూరు

నగర నియోజకవర్గం సిపిఎం 4, 9 డివిజన్ల శాఖా సభ్యుడు బాణాల వెంకటేశ్వర్లు మతికి సిపిఎం నాయకులు నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ సభ్యుడు బాణాల వెంకటేశ్వర్లు హఠాత్తుగా గుండె పోటుతో మతి చెందారు. మతుడు నగరంలోని 4, 9 డివిజన్ల శాఖా సభ్యులుగా ఉన్నారు.బుధవారం నవా బుపేట ప్రాంతంలోని బంగ్లా తోట వారి స్వగహం వద్ద అంత్యక్రియలు జరిగాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్ రావు, సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు నగర నాయకులు తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లు భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి నివాళి అర్పించారు. నగర కమిటీ పరిధిలో ఐరన్ మొబైల్ వర్కర్స్ యూనియన్ నగర నాయకులుగా బాణాల వెంకటేశ్వర్లు సుధీర్ఘ కాలం పనిచేశారన్నారు. వెంకటేశ్వర్లు కమ్యూనిస్టు ఉద్యమంలో నిజాయితీగా తుది శ్వాస విడిచేవరకు ఆదర్శంగా నిలిచారని కొని యాడారు. నివాళి అర్పించినవారిలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జీ నాగేశ్వరరావు నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, మూలం ప్రసాద్,షేక్ జాఫర్, ఆవాజ్ నగర కార్యదర్శి షేక్. రియాజ్,శాఖా కార్యదర్శులు షేక్. రవుఫ్, ఎం. శ్రీని వాసులు, ఎం. అశోక్ స్థానిక నాయకులు సలాం, రవుఫ్, చిరంజీవి, సురేంద్ర ఉన్నారు.

వెంకటేశ్వర్లు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

వర్షాలతో పత్తి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి -గుడ్లూరు :బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా మండలంలో చెదురు ముదురుగా వర్షాలు కురు స్తున్నాయి. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందు తున్నారు వర్షానికి ముందు మెట్ట పొలాల్లో రైతులు భారీ ఎత్తున పత్తి పంట సాగు చేశారు. పచ్చి విత్తనాలు మొలకెత్తే దశలో ఉండగానే ఈ వర్షాలు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ. 25 వేల వరకు పెట్టుబడులు పెట్టి పత్తి సాగు చేసినట్లు రైతులు చెబు తున్నారు. గుడ్లూరు పరిధిలోసుమారు 2500 ఎకరాల్లో పచ్చి సాగు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ వర్షాలు ఇలాగే ఉంటే పత్తి విత్తనాలు మొలకెత్తే దశలోనే కునారిల్లిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి -నెల్లూరు :నేడు శెట్టి గుంట రోడ్డు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈ ఈ ఎం శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.33/11 కె.వి. శెట్టిగుంట రోడ్డు సబ్ స్టేషన్ పరిధి లోని రోడ్డు వెడల్పు చేసిన కారణంగా విద్యుత్ స్తంభాలు మార్చేందుకు సరఫరా నిలిపిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

27న కందుకూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-కందుకూరు :ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్,సీడాప్ సంయుక్తంగా ఈ నెల 27న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. మస్తానయ్య తెలిపారు. పూర్తి వివరాలకు 9848050543, 6301543185 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు : విద్యుత్ చార్జీల పెంపు ద్వారా రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ వైసిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకత్వంలో ఈ నెల 27న కందుకూరులో తలపెట్టిన వైసిపి పోరుబాట కార్యక్రమ పోస్టోర్‌ను కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. నాయకులు గణేశం గంగిరెడ్డి, రేణమాల అయ్యన్న, దగ్గు మాటి కోటయ్య, షేక్ రహీం, సుల్తాన్ భాష, మేడబలిమి మాలకొండయ్య, షేక్ బాషా,సీనియర్ న్యాయవాది ముప్పవరపు కిషోర్ పాలఒగన్నారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని పదే పదే చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఓడ దాటిన సామెత ప్రకారం వ్యవహరించారని ఎద్దేవా చేశారు. 27న జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు.

రైతు సమస్యలపై రాజకీయం చేయొద్దు : జనసేన

ప్రజాశక్తి - లింగసముద్రం : పవన్ కల్యాణ్ ఆశయాలు, లక్ష్యాలు కొనసాగేలా ఒక ఉన్నత ఆశయంతో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పనితీరు ఉండటం గర్వకరాణమని జనసేన మండలాధ్యక్షులు అంగులూరి నరసింహారావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కందుకూరు రైతాంగానికి జీవనాడి వంటి రాళ్ళపాడు రిజర్వాయర్ కుడి కాల్వ గేట్ మరమ్మతుల పట్ల ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తీసుకున్న చొరవ అభినందించే విషయమన్నారు. రైతుల ఆందోళన దష్టిలో ఉంచుకుని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తన సొంత నిధులతో గేట్ మరమ్మతులకు పూనుకున్న విషయం రైతులు గమనించాలన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకోలేదని రైతాంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని అని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దన్నారు. రైతుల సమస్యలపై రాజకీయాలు చేయొద్దన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్ళలో రిజర్వాయర్ గేట్లకు కనీసం గ్రీస్ కూడా పెట్టలేదని విమర్శించారు.

అంగులూరి నరసింహారావు, జనసేన మండల అధ్యక్షులు

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నేడు సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు : సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభ కందుకూరులో గురువారం నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మాలకొండయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశ స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించి, కార్మిక, కర్షక వర్గాలకు అండగా నిలిచిన పార్టీ సిపిఐ అన్నారు. పార్టీ ఆవిర్భవించి పందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ త్సవాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, నాయకులు షేక్ హుస్సేన్, ఉప్పుటూరి మాధవరావు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆనందమోహన్ ఉన్నారు.

చమురు శుద్ధి కర్మాగారం

పెట్టుబడులు రెండింతలు..!

రామాయపట్నం వద్ద నిర్మించే అవకాశాలు? - రూ.95 వేల కోట్లతో నిర్మించాలని ప్రతిపాదన

ప్రజాశక్తి-కందుకూరు

ప్రతిపాదిత రామాయపట్నం చమురు శుద్ధి కర్మాగారం భారీ పెట్టుబడులతో ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తుంది. సుమారు రూ. 95 వేల కోట్ల పెట్టుబడితో చమర శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని భారత పెట్రోలియం కార్పొరేషన్ భావిస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలోని షరతుల మేరకు రాష్ట్రంలో చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కర్మాగారం ఏర్పాటు బాధ్యతను కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌కు అప్పగించింది. కర్మాగారం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని రామాయపట్నం ఓడరేవు, కష్ణా జిల్లాలోని మచిలీపట్నం ఓడరేవు, శ్రీకాకుళం జిల్లాలోని మూలాపేట ప్రాంతాలను సూచించిన విషయం తెలిసింది. ప్రాథమిక పరిశీలన అనంతరం రామాయపట్నం ఓడరేవు పరిసర ప్రాంతాలే చమురు శుద్ధి కర్మాగారంతో పాటు పెట్రోల్ రసాయనాల కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువైన స్థలమని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ భావిస్తున్నట్లు ఇంతకుముందే సమాచారం బయటకు పొక్కింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ మంగళవారం నిర్వహించిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కోస్తా తీరంలో చమురుశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్మాగారంతో పాటు పెట్రో రసాయనాల కాంప్లెక్స్ నిర్మాణానికి ముందస్తు సన్నాహాల కోసం రూ. 6,100 కోట్ల ఖర్చు చేయడానికి కూడా డైరెక్టర్ల బోర్డు అనుమతించింది. ఈ విషయాలను ఆ కంపెనీ నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ,ముంబై స్టాక్ ఎక్స్చేంజ్ లకు సమాచారం ఇచ్చింది. మన రాష్ట్రంలో కర్మగారాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై డైరెక్టర్ల బోర్డు నిర్ణయం తీసుకోలేదు. ఎంత సామర్థ్యంతో కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారనే విషయాన్నిడైరెక్టర్ల బోర్డు సమావేశంలో ప్రస్తావించలేదు. ఈ విషయాలు ఇప్పటికీ సందిగ్ధంగా ఉన్నప్పటికీ సుమారు 5 వేల ఎకరాలలో రూ. 6,100 కోట్ల ఖర్చుతో ముందస్తు సన్నాహాలు చేయాలని నిర్ణయించారనేది స్పష్టమైంది. భూమి గుర్తింపు, సేకరణ, పర్యావరణ ప్రభావం అంచినా, ఇంజినీరింగ్ డిజైన్లతో పాటు వివిధ అధ్యయనాల కు 6,100 కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. సుమారు 5000 ఎకరాల భూమిని సేకరిస్తే ఇందుకోసం మే దాదాపు 1500 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రతిపాదిత చమ్మురు శుద్ధి కర్మాగారం ఉత్పత్తి సామర్థ్యాన్ని డైరెక్టర్ల బోర్డు స్పష్టం చేయకపోయినప్పటికీ భారత పెట్రోలియం కార్పొరేషన్ భారీ సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకునే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ బిపిసిఎల్‌కు మూడు చమురు శుద్ధి కర్మాగారాలు ఉన్నాయి. అవి యుపి, ,మధ్యప్రదేశ్ ,మహారాష్ట్రలో ఉన్నాయి. వాటి ఉత్పత్తి సామర్థ్యం 30 మిలియన్ల టన్నులు. ఈ దశాబ్దాంతానికి తమ సామర్థ్యాన్ని 50 వేల మిలియన్ల మెట్రిక్ టనులకు పెంచుకోవాలని బిపిసిఎల్ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఆ లక్ష సాధనకు పెట్టుబడుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా సౌదీ అరేబియా కి చెందిన సౌదీ ఆరాం కో కంపెనీతో సంప్రదింపులు జరుపుతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్రోలియం కంపెనీలలో సౌదీ ఆరాంకో ఒకటి. మనదేశంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడానికి సౌదీ ఆరాంకో ఇంతకుముందే సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న చమురుశుద్ధి కర్మాగారంతో కూడిన పెట్రో రసాయనాల కాంప్లెక్స్ మొత్తం ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచాలని బిపిసిఎల్ భావిస్తుందని తెలుస్తోంది. ప్రతిపాదిత భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని 9 నుంచి 12 మిలియన్ల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ. 55 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించాలని బిపిసిఎల్ తొలుత భావించింది. ఇప్పుడు ఆ పెట్టుబడులను 95 వేల కోట్ల రూపాయలకు పెంచాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దశలవారీగా ఏడేళ్లలో ఈ కర్మాగారాన్ని పూర్తి చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



రామాయపట్నం పోర్టు ఇదే..



అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

చివరి భూములకూ నీరందిస్తాం..

ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలోని చివర భూములకు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. బుధవారంఆయన రాళ్లపాడు ప్రాజెక్టు వద్దకు వచ్చి అక్కడ జరుగుతున్న పనుల గురించి అధికారుల ద్వారా తెలుసుకున్నారు. కుడి కాలువ నుండి వెళ్తున్న నీటిని మధ్యలో కొన్ని గ్రామాల రైతులు అడ్డుకట్ట వేసి అవుతున్నారని కొందరు రైతులు ఎంఎల్ఎ దష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే కాలువ మీద తిరిగి అడ్డుకట్టను తొలగించి కిందికి నీరు వెళ్లేలా చూడాలని అధికారులకు సూచించారు. కాలువకు చెక్కలు అడ్డంపెట్టి నీటిని వెళ్లకుండా చేస్తున్న ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలని ఎస్ఐకి చెప్పారు.కొన్నిచోట్ల సిబ్బందిని పెట్టి నీటి సరఫరా జరిగేలా చూడాలని ప్రాజెక్ట్ అధికారులకు తెలిపారు.కుడికాలువ తూము గేటుకు ఎదురుగా ఇనుప ప్లేట్లను ఏర్పాటు చేసి ఇసుక బస్తాలతో నీటి ప్రవాహాన్ని తగ్గించి గేటును తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ఎంఎల్ఎకు వివరించారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని ఎంఎల్ఎ తెలిపారు.ప్రాజెక్ట్ డిఈ వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు చైర్మన్ ఏలూరు వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు ఏఈ మనోహర్ లింగసముద్రం సాగునీటి సంఘం చైర్మన్ పోలిమేర చిన్ననాగిరెడ్డి,టిడిపి నాయకులు అడపా రంగయ్య, సోంపల్లి మనోహర్,బింక శేషయ్య,పూరిమిట్ల గురునాథం,గద్దె లక్ష్మీనరసింహం,గాలంకి ప్రసాద్ ఉన్నారు.

దీక్ష చేస్తున్న దృశ్యం

సబ్ కలెక్టర్ హామీతో దీక్ష విరమణ

ప్రజాశక్తి-కందుకూరు : జి మేకపాడు గ్రామంలో సర్వే నంబరు269లో ఉన్న, 7.40ఎకరాల భూమిని స్వాధీనం చేయాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మర్రిపూడి మండలం నరసరాజుపాలెం గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో మూగ మహిళ, వికలాంగురాలు, చెమిటి వద్ధురాలు, పాల్గొన్నారు.ఉదయం నుండి వర్షం పడుతున్న తడుస్తూనే ఆందోళన చేపట్టడం విశేషం. వీరికి వ్యతిరేకంగా కొండపి నియోజకవర్గ టిడిపి నేతలు ఉండటం వల్ల అక్కడ రెవెన్యూ ,పోలీసు వ్యవస్థలు అధికార పార్టీ చెప్పు చేతల్లో ఉన్నాయని, అందుకే ఇక్కడ దీక్ష చేపట్టాల్సి వచ్చిందని గుట్లపల్లి సురేష్, సత్యవతి తెలిపారు. దీక్షను చూసిన సబ్ కలెక్టర్ శ్రీశీ పూజ వారిని పిలిచి సమస్యను తెలుసుకున్నారు. శుక్రవారం లోపు పోలీస్ ఇన్‌స్పెక్టర్ తాసీల్దార్‌ని పంపించి పరిష్కరిస్తానని దీక్ష విరించాలని సూచించడంతో వారు ఆందోలన విర మించారు. ఎండ్లూరి ఆదిలక్ష్మి, కొండమ్మ, గుట్లపల్లి విజయమ్మ ఆందోళనలో పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు టి ఆర్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా షేక్ నాగూర్ వలి నియమితులయ్యారు. ఇంటర్‌మీడియట్ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికల) గుంటూరులో ఉర్దూ జూనియర్ అధ్యాపకునిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపె టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్ గా ఓరుగంటి వెంకటేశ్వరరావు గారు(ఎఫ్ఎసి) నుండి నూతన ప్రిన్సిపాల్‌గా షేక్ నాగూర్ వలికి మంగళవారం బాధ్యతలు అప్పగించారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

బాధ్యతలు తీసుకుంటున్న నాగూర్ వలి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కందుకూరులో..

గుడ్లూరు రూరల్..

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని 25వ వార్డు ప్రశాంతి నగర్ ప్రార్థన మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఎంఎల్శ్రీ ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. క్రైస్తవ సోదరులు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ ను పాస్టర్లతో కలిసి కట్ చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు ఉన్నారు.

పజాశక్తి -గుడ్లూరు: క్రిస్మస్ పండుగ సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. పాస్టర్లు వద్ధులకు చీరలు దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గిరిజన కాలనీ, ఎస్‌సి కాలనీ హైస్కూల్ సంఘం మామిడి చెట్ల దగ్గర ఉన్న చర్చిలలో క్రీస్తు సందేశాలు వినిపించారు. పాస్టర్ జీవన్ బాబు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

గుడ్లూరు రూరల్ : మండలంలోని పలు చర్చిలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కొన్ని గ్రామాల్లో వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్లు జీవన్ బాబు .గోచిపాతల మెత్తుషాలా. అఖిలగుంట ప్రకాశం అఖిల గుంట చంద్రయ్య. అఖిల గుంట వారయ్యా. పరంజ్యోతిల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.పలు చోట్ల అన్నదానం చేశారు.

పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి

మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపుమేరకు కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాలతో 27న రాష్ట్ర ప్రభుత్వ కరెంట్ ఛార్జీల పెంపుపై "వైసిపి పోరుబాట" గోడ పత్రికలను నాయకులు ఆవిష్కరించారు. బుధవారం మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. 27వ తేదీ ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్ద మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరగబోవు టిడిపి ప్రభుత్వం కరెంటు ఛార్జీల బాదుడే బాదుడుపై వైసిపి పోరుబాట కార్యక్రమంలో కావలి నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ, గంథం ప్రసన్నాంజనేయులు, పందిటి కామరాజు, నాయబ్ రసూల్, చెన్ను కృష్ణారెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'కాకాణి' వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజాశక్తి-వెంకటాచలం : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టిడిపి నాయకులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంది రమేష్ యాదవ్ మాట్లాడుతూ కాకాణి గోవర్ధన్ రెడ్డి సర్టిపై చేస్తే మందల వెంకట శేషయ్య వ్యక్తిత్వం అమోఘమైపోతుందా అని ఆరా తీశారు. అన్యాయానికి గురైన మహిళకు అండగా నిలవాల్సింది పోయి తన ముఠా సభ్యత్వం వేసుకోకపోవడం కాకాణి వ్యక్తిత్వానికి నిదర్శనం అని అన్నారు. సోమిరెడ్డితో రాజకీయ పోరాటం చేయలేక కాకాణి గోవర్ధన్ రెడ్డి గాడ్స్ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కాకాణి ఇక గెలిచే ప్రసక్తిలేదని ఇకనైనా ఉత్తర కుమార ప్రగల్భాలు పలకడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-విడవలూరు : ప్రకృతి సిద్ధమైన సేంద్రియ వ్యవసాయంతో పంటలు పండించి తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని వ్యవసాయదారుల సమ్మేళనంలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ సైంటిస్టుల సలహాలు సంప్రదింపులతో సేంద్రీయ వ్యవసాయంలో మంచి దిగుబడి సాధిస్తున్న హరితకుమార్ రెడ్డి అను ఉద్యోగుల మరొకప్పు రైతుగా 'సేంద్రియ పంటలు పండిస్తూ కలుషితం లేని ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కలుషితం లేని నాణ్యమైన సేంద్రియ పంటలను పండించి ప్రజలు తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తన బిడ్డలకు విషం లేని ఆహారం తినిపించాలనే లక్ష్యంతో ఈ సేంద్రియ వ్యవసాయం చేయడం జరిగిందన్నారు. ఈ ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కోవూరు : ప్రస్తుతం చలికాలం ప్రారంభమైన నేపథ్యంలో అనాథాశ్రమంలోని వృద్ధులకు తమవంతుగా ఏదైనా చేయాలని మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్ తనయుడు ఇమ్రాన్ ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో కోవూరులోని శాంతినగర్లో ఉన్న లక్ష్మీపార్వతి వృద్ధుల ఆశ్రమంలో బుధవారం వారు 100 మందికి పైగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్ మాట్లాడుతూ ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొనడం వలన ఎంతో ఆత్మ సంతృప్తిగా ఉందన్నారు. వృద్ధులను తమ బిడ్డలుగా భావించి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ఈ ఆశ్రమ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను తమవంతుగా తాము తరచూ చేస్తూనే ఉన్నామన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఇమ్రాన్‌ను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోవూరు మైనార్టీ నాయకులు జమీర్, మనూర్, జహంగీర్, ముజఫర్, జబీర్ బాషా, షాహుల్, హమీద్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరంపై దాడి

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేశ్వర రావు ఉత్తర్వుల మేరకు కావలి రూరల్ ఎస్.ఐ. తిరుమల రెడ్డి, వారి సిబ్బందితో కలిసి బుధవారం తుమ్మలపెంట గ్రామంలో కోడిపందేల స్థావరంపై దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ.5600 నగదును, 3 కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని కావలి రూరల్ సిఐ రాజేశ్వర రావు కోరారు.

వాజ్‌పేయి జయంతి

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ బిజెపి అధ్యక్షులు కట్టుబోయిన బ్రహ్మానందం అధ్యక్షతన బుధవారం భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుండ్లపల్లి భరత్ కుమార్, అంచిపాక కమల, సిపిసి సత్యం, వరసు వెంకటేశ్వర్లు, వింత రంగారెడ్డి, పూనూరు మాధవి, పాతపాటి రమణారెడ్డి, ఆమూరి వెంకట సుబ్బారావు, మంద కిరణ్‌కుమార్, కూరాకుల సవీంద్ర, వల్లపు తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని సోషల్ మీడియా వింగ్ (ఆనంద్ వైఖర్య) సభ్యులు మర్యాదపూర్వకంగా ఆనం రామనారాయణ రెడ్డిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణ రెడ్డి వారితో సంభాషిస్తూ సభ్యత్వ నమోదులో ప్రజలకు అవగాహన కల్పించి మొదటి స్థానం వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం ఐదో స్థానంలో ఉండడంతో సోషల్ మీడియా వింగ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా వింగ్ శివారెడ్డి, షేక్ వసీం, షేక్ మిరాజ్, షేక్ ఫరీద్, సమీర్, ఎస్‌డి షోయబ్, సానూర్, ముజీబ్ తదితరులున్నారు.

రిజిస్టర్లను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ సుజాత

ఆరోగ్యకేంద్రంలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రాథమిక వైద్యశాలోగ్య కేంద్రంలో బుధవారం జిల్లా వైద్యాధికారిణి సుజాత ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది పని తీరు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రి గదులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ ప్రాంత ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారిని చైతన్య పరచాలన్నారు. ఆమెవెంట వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ ఉన్నారు.

గంజాయి అక్రమరవాణా గుట్టురట్టు

ప్రజాశక్తి-ఉదయగిరి

సిఐ వెంకట్రావు తమ సిబ్బందితో మెరుపు దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతో రహస్యంగా సాగుతున్న అక్రమ గంజాయి గుట్టు రట్టయింది. ఈ సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు ఆయన వివరాలను వెల్లడించారు. జిల్లాలో గంజాయి అక్రమ రావాణాపై గట్టి నిఘా ఉంచి, విద్యార్థుల యువత జీవితాలను నాశనం చేస్తున్న నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంలో జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు, సబ్ డివిజనల్ అధికారి పి.శ్రీధర్ నేతృత్వంలో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు ఉదయగిరి, దుత్తలూరు, సీతారామపురం, వరికుంటపాడు ఎస్‌ఐలు వారి సిబ్బంది ప్రత్యేక నిఘా తో రాబడిన సమాచారం మేరకు ముప్పే చిన్నకొండయ్య తండ్రి మాలకొండయ్య, వయసు 60సంవత్సరాలు జి.కొండారెడ్డిపల్లి గ్రామము, వరికుంటపాడు మండలం మొదటి నిందితుడిగా దాసరి సుధాకర్ తండ్రి సుబ్రహ్మణ్యం, వయసు 44 సంవత్సరాలు స్థానిక స్టేట్ పేట, ఉదయగిరి చెందిన

మాట్లాడుతున్న సిఐ వెంకట్రావు

వ్యక్తిని రెండవ నిందితుడిగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సుధాకర్ ఉదయగిరి నుంచి సీతారామపురం వెళ్లే రోడ్డు 167- హైవే బిజి, ఉదయగిరి పట్టణ శివార్లలో గంజాయిని కొనుగోలు చేయుచుండగా వచ్చిన సమాచారంతో సిఐ వెంకట్రావు తమ సిబ్బంది దాడులు నిర్వహించి తహశీల్దార్ ఎం.సుభద్ర ఆధ్వర్యంలో వారిని అదుపులోకి తీసుకొని వారిని విచారించి మొదటి నిందితుడి వద్ద నుండి 130 గ్రాముల గంజాయి ప్యాకెట్‌లను రెండవ నిందితుడి వద్ద నుండి 100 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను రూ.1500 స్వాధీనం చేసుకున్నామన్నారు. విచారణలో గంజాయిని భైరవకోనకు వచ్చే సాధువుల దగ్గర తెచ్చుకుంటునట్లు తెలిసిందని దాంతో ఎస్‌ఐ -2 తో టీమును ఏర్పాటు చేశామని త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో సుమారు 20మంది గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం ఉందని వారందరికీ కౌన్సిలింగ్ నిర్వహించి తహశీల్దార్ వద్ద అదుపులోకి తీసుకుని తగు నేర నివారణ చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా సర్కిల్ పరిధిలోని 4 మండలాల ప్రజలు గంజాయి లాంటి మత్తు పదార్థాల గురించి తెలిస్తే తమకు సమాచారం అందించాలని, అలాగే రాబోవు సంక్రాంతి పండుగ సర్కిల్ పరిధిలో పేకాట, కోడి పందేలు, ఎర్ర చందనం అక్రమరవాణా ఏ ఇతర అసాంఘిక కార్యకపాలపాలపైనా జరిగితే ఫోన్ 9440700001, 9440700002, 9440700003, 9440700004, 9440700005, 9398091207 నెంబర్లకు ముందస్తుగా సమాచారం పోలీసులకు సహకరించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై 27న నిరసన

ప్రజాశక్తి-కావలి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై పార్లమెంటులో హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం 4గంటలకు కావలి అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలు, బి.సి., బడుగు వర్గాల ప్రతినిధులు, అణగారిన వర్గాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 17 పార్లమెంట్‌లో కేంద్ర హోమ్ మినిస్టర్ అమిత్‌షా, అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడని తెలిపారు. అంబేద్కర్‌ను అవమానించే విధంగా అమిత్‌షా మాటలున్నాయన్నారు.

రాజ్యాంగంపై ప్రమాణ చేసి ప్రభుత్వాన్ని నడుపుతున్న అమితాషా ఆ రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఇదే రాజ్యాంగం లేకపోతే అమిత్‌షా ఎక్కడో చిరువ్యాపారం చేసుకునేవాడని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విలువలతో గద్దె నెక్కిన పాలకులు రాజ్యాంగస్ఫూర్తిని తుంగలో తొక్కడం, మొదటిసారి కాదు కనుక అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మాల మహానాడు, అంబేద్కర్ యువజన సంఘం, ఎంఆర్‌పిఎస్, బి.సి. ఐక్యత, సమతా సైనిక దళ్, బుద్ధ విహార్, ముస్లిం మైనార్టీ సంఘాలు, దూదేకుల సంఘం, పిడిఎస్‌యు, బి.టి.ఎ. విద్యార్థి సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు, కాంగ్రెస్ పార్టీ, సిపిఐ ఎంఎల్ పార్టీలు, విరసం, జనప్రకాషిణి, ఉపాధ్యాయ సంఘాలు, తదితరులు ఉమ్మడిగా సమావేశమై తీసుకున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఆనంద్, బిసి ఐక్యత నాయకులు వరప్రసాద్, అద్దంకి ప్రభాకర్, మోహన్, సమతా సైనిక దళ నాయకులు సుందర్, ఉదయ్ భాస్కర్, జమ్మలపాలెం మాజీ సర్పంచ్ మాధవరావు, వామపక్ష నాయకులు పసుపులేటి పెంచలయ్య, కె.నాగరాజు, కరవది భాస్కర్, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ జిలాని, సిరాజ్ దూదేకుల సంఘం నాయకులు చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనల్లో పాల్గొన్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

పలు చర్చిల్లో ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి ప్రార్థనలు

ప్రజాశక్తి-కావలి

క్రిస్మస్ పండుగ సందర్భంగా ఎం.ఎల్.ఎ. కావ్య క్రిష్ణారెడ్డి బుధవారం పట్టణంలోని పలు చర్చిల్లో ప్రార్థనలు చేసి, పండుగ సందర్భంగా కేక్‌లు కత్తిరించి, క్రిస్టియన్లతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. బుడంగుంట రైల్వే గేట్ దగ్గర, ప్రశాంత నగర్‌లో షారోను బాపిస్ట్ చర్చిలో, కచ్చేరిమిట్ట సదరన్ తెలుగు బాప్టిస్ట్ సంఘం చర్చిలలో, పట్టణంలో వివిధ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సర్వ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన యుగకర్త యేసు క్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండుగ దినం అని తెలిపారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు తన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ప్రేమ మార్గంలో ఎవరి మనసునైనా జయించవచ్చని తన జీవితం ద్వారా నిరూపించిన క్రీస్తు మార్గంలో నడుస్తూ సాటి మనిషికి మేలు చేయడమే మనముందున్న కర్తవ్యమన్నారు. ప్రేమ, కరుణ, సహనం, దయ,త్యాగ గుణాలను అలవాటు చేసుకుని జీవితాన్ని శాంతిమయం చేసుకుందామని తెలిపారు. సర్వ మానవాళికి మేలు కలగాలని ప్రభువును ప్రార్థిద్దామన్నారు.

ఘనంగా గంధమహోత్సవం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని గండువారిపల్లి గ్రామ పరిధిలోని ఖాదర్ నగర్‌లో శ్రీ హజరత్ ఖాదర్‌వలీ రాహుల్ ఔలియా నాగూర్ మీరా స్వాములవారి 37వ ఉరుసు గంధమహోత్సవం 27వ తేదీ జరుగురని సయ్యద్ ఖాజా ఆలీషాబాబా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధమహోత్సవం 27వ తేదీన జరుగుతుందన్నారు. 28వ తేదీన ఉరుసు, 29వ తేదీన తహలీల్ ఫాతిహా ఉంటుందని తెలిపారు. ఈ గంధ మహోత్సవానికి వేలాదిగా భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

జిల్లాలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలు బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమయ్యాయి. బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని చర్చిలు నూతన శోభను సంతరించుకున్నాయి. క్రైస్తవులు చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేటలో ఉన్న సెయింటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి, సెంట్రల్ తెలుగు బాప్టిస్టు చర్చి, సియోన్ ప్రార్థన మందిరం, రోమన్ క్యాథలిక్ చర్చి, సెయింట్ థెరిస్సా చైల్డ్ జోసఫ్, సెయింట్ మేరీస్ చర్చిలు క్రైస్తవులతో కిటకిటలాడాయి. పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. అనంతరం పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. పట్టణంలోని పలు చర్చిలలో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్‌ను వేడుకగా జరుపుకున్నారు. క్రైస్తవులు 9 గంటలకే చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఏసుక్రీస్తు పాపులను రక్షించేందుకే జన్మించారని, ఆయన తెలిపిన శాంతివచనాలు ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. క్రిస్మస్ కేక్‌ను పంచిపెట్టారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. మహిళలు ప్రార్థనా మందిరాల్లో అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని అన్ని గ్రామాలలో క్రైస్తవ సోదరులందరూ క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండి అన్ని చర్చలలో ఏసుక్రీస్తు ప్రార్థనలు ప్రారంభించారు. చర్చలకు వచ్చిన భక్తులందరికీ బైబిల్‌లోని సువార్తలను చదివి వినిపించారు. అనంతరం ఏసుక్రీస్తు పూర్తి సందేశాన్ని భక్తులందరికీ తెలియజేశారు. ఏసుక్రీస్తు పైన భక్తి విశ్వాసాలతో కొలిచే వారందరూ భక్తి పాటలను గానం చేశారు. ముందుగా భారీ కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టినారు. అనంతరం ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవు భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని చర్చిలు రంగురంగులతో ముస్తాబు చేసి స్టార్ ట్రీను ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని క్రిస్టమస్ పండగ సందర్భంగా అన్ని చర్చిలకు స్వీట్లు కేకులను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ నిర్వాహకులకు అందజేశారు. క్రీస్తు బోధనలు చాలా గొప్పవని ఈ దేశంలో అన్ని మతాలు అన్ని కులాలు ఒక్క సారాంశం ఒకటేనని, కులమత బేధాల గూర్చి ఏ మత గ్రంథాలు చెప్పలేదని తెలిపారు. ఈ దేశంలో అన్ని కులాలు అన్ని మతాలు కలిసి జీవించడమే మత గ్రంథాల ముఖ్య సందేశంగా వివరించారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల వ్యాప్తంగా బుధవారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థన నిర్వహించి ఏసు జీవిత చరిత్రను వివరించారు. ప్రేమ కరుణ సహనం దయా త్యాగం గుణాలను అలవాటు చేసుకునే జీవితాన్ని శాంతిమయం చేసుకోవాలని కోరారు. అనంతరం పాస్టర్లు కేక్ కట్ చేసి చిన్నారులకు పంచి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని ప్రధాన చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శారా బిలాక్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య సాగర్ మాట్లాడుతూ క్రీసు జననం లోకానికి ఎంతో ఆదర్శనీయమన్నారు.కార్యక్రమంలో చర్చి పాస్టర్ డి. రాజేష్, చైర్మన్ రత్నానందరావు, కార్యదర్శి మోహన్, కోశాధికారి కుమార్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలం లోని చర్చిలలో బుధవారం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. ఫెలోషిప్ ఆఫ్ గాడ్ సంస్థ చైర్మన్ కుందవరం బాబి ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో మండలంలోని ఇస్కపాలెం, తోటపల్లి గూడూరు, కామాక్షినగర్, డక్కిలివారిపాలెం, మాచర్ల వారిపాలెం, తో టపల్లి, వరిగొండ, రావూరు వారికండ్రిగ, పేడూరు కొలిది బ్బ, ఈదూరు, తదితర చర్చిలలో క్రిస్మస్ వేడుకలు అ త్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలు మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల్లో వెలిగాయి. ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలతో కిటకిటలాడాయి. చిన్నారులు ప్రదర్శించి నత్యాలు, క్రైస్తవ నాటికలు, శాంతాక్లాజ్ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

అదానీ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : అదాని వరల్డ్ స్కూల్ లో బుధవా రం క్రిస్మస్ పర్వదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు శోభా మిశ్ర మాట్లాడుతూ విద్యార్థులు కుల, మత రహిత భక్తి భావంతో, సమైక్య భావనతో మెలగాలని సూచించారు. పాఠశాలలో ప్రతి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుతామన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శిం చిన నృత్యాలు, నాటికలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు క్రిస్మస్ పండుగను పురస్కరిం చుకొని పేదలకు నిత్యా వసర వస్తువులు అందజేశారు. వి ద్యార్థులు సేకరించిన వస్తువులను ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయ బృందం జనహిత వాత్సల్య అనాథ శరణాలయం వారికి అందించారు. అదాని సైనిక్ ఆరవ తరగతి విద్యార్థులు ఎంతో విలు వ గలిగిన వస్తువులను సేకరించారని హెచ్ఎం శోభా మిశ్ర తెలియ జేశారు. ఈ విధంగా చేయడం ద్వారా వి ద్యార్థులలో సేవాభావం పెరుగు తుందని తెలియజేశారు. భక్తి భావంతో చేసే సేవ కార్యక్రమాలు విద్యార్థులలో సరైన సమైక్యతాభావనను కలుగజేస్తాయని, వారి అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయని తెలియ జేశారు. వేడుకలలో పాఠశాల కో ఆర్డినేటర్స్ ఉష, సుమ న్, దేవకీలు, అడ్మిన్ బృందం పా ల్గొని విద్యార్థులకు తల్లి తండ్రులకు శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఎంఎల్ఎ సహకారంతో సౌకర్యాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఎస్‌సి కాలనీలో రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఎంఎల్ఎ కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లి రోడ్లు వేయించడంతోపాటు భూమిలేని నిరుపేదలందరికీ అసైన్డ్‌మెంట్ కమిటీలో చేర్చి ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశాలా కృషి చేస్తానని మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని విరువూరు చర్చిలో ఆయన క్రైస్తవ సోదరులతో మమేకమై బుధవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దాతృత్వంతో వచ్చిన స్వీట్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ కాకర్ల సురేష్ క్రైస్తవ సోదరుల మీద ప్రేమ అభిమానంతో ప్రతి గ్రామంలో ఉండే క్రైస్తవులందరికీ క్రిస్మస్ పండుగ సందర్భంగా స్వీట్స్ పంపించడం ఎంతో సంతోషమని ఆయనను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్ గుబిలి రమణయ్య కుమారుడు ప్రవీణ్ దాతత్వంతో బహుమతులను క్రీస్తు

స్వీట్స్‌ను అందజేస్తున్న దృశ్యం

జననం నాటికలో గెలుపొందిన వారికి ఆయన అందజేశారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత ముజ్జే లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు మాలెం హజరత్ రెడ్డి, మావిళ్ళపల్లి తిరుపతిరెడ్డి, మాలెం తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న గుణపాటి సురేష్‌రెడ్డి

'గుణపాటి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వైసిపి సీనియర్ నాయకులు గుణపాటి సురేష్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఇందుకూరుపేటలోని ఆయన నివాసం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు భారీ బైక్ ర్యాలీ ప్రదర్శన అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అభిమానుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. పలువురు శాలువాలతో, బొకేలతో సత్కరించి, సురేష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

27న ఖాదర్ బాషా సంస్మరణ సభ

ప్రజాశక్తి-కోవూరు

కామ్రేడ్ ఎస్‌కె ఖాదర్‌బాషా సంస్మరణ సభ ఈనెల 27వ తేదీ శుక్రవారం స్థానిక సీతాపోలయ్య భవనంలో సాయంత్రం 3గంటలకు జరుగునని సిపిఎం మండల కమిటీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీసభ్యులు, సానుభూతిపరులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల కమిటీ నాయకులు కోరారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని కొండాయపాలెం గ్రామంలో గురువారం జరిగే రెవెన్యూ సదస్సును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని విఆర్ఒ శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మండలంలోని కొండాయపాలెం గ్రామపంచాయతీలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు జరగనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా విరువూరు సచివాలయంలో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు సదస్సు జరగనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రసన్నకు అశ్రితరెడ్డి అభినందనలు

ప్రజాశక్తి-కోవూరు

వైసిపి విద్యార్థి విభాగం నెల్లూరు జిల్లా అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన అశ్రితడ్డి బుధవారం మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని కలిసి పూల మొక్కను బహూకరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ లక్ష్మణ్‌స్వామి

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-ఉదయగిరి

బ్రాహ్మణపల్లి టోల్‌ప్లాజా వద్ద 37 మిలిటరీ ఫుల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సిఐ లక్ష్మణ్‌స్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లి టోల్‌ప్లాజా వద్ద ఉదయగిరి ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టామని అందులో భాగంగా బెంగళూరు నుంచి ఓ బస్సులో అక్రమంగా మద్యం తరలిస్తున్నారని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 37 మిలిటరీ ఫుల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని ఆరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ లక్ష్మణ్‌స్వామి తెలిపారు.

'సంయుక్త'లో స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కావలి

కావలి స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్.ఖాదర్ బాషాకు 50వ వివాహ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్నేహితులు, ఆధ్వర్యంలో బుధవారం కావలి సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర వివాహ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కావలి సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర ఆధ్వర్యంలో సంస్థ గౌరవ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు, విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి షేక్.ఖాదర్ బాషా, చాంద్ బేగంల 50వ వివాహ వార్షికోత్సవం సందర్భముగా దంపతులను దుశ్శాలువా, గులాబీ పూల మాలలతో, ఘనంగా సత్కరించి, భారీ కేక్ కట్ చేసి, హార్దిక శుభా కాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బి.వి. రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, సంయుక్త సేవాసంస్థ గౌరవ సభ్యులు ఎం.వి.ఎన్. ప్రసాద్ రావు, సంయుక్త సేవా సంస్థ సభ్యులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, బుర్లా రఘుకుమార్ రెడ్డి, ఎమ్.అజిత్ బాబు, హ్యాపీ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ ఘనీ బాషా, సంయుక్త సేవాసంస్థలో చదువుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ బాషా ప్రభుత్వ వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖలో వసతి గృహ సంక్షేమాధికారిగా అంకిత భావంతో విధులు నిర్వహించి

ఖాదర్‌బాషా దంపతులను సన్మానించిన దృశ్యం

అధికారుల మన్ననలు ప్రేమాభిమానాలు పొందారని తెలిపారు. ఉద్యోగ విరమణ తరువాత కూడా స్వచ్ఛంద సంస్థలలో సేవలు అందిస్తు సేవాభావంతో పని చేస్తున్నారని తెలిపారు. విశ్రాంత లెక్చరర్ ప్రసాద్‌రావు ప్రేమ పూర్వకంగా దంపతులను, సత్కరించి ఆశీస్సులు తెలియజేస్తూ నూతన దుస్తులను అందజేశారు. సన్మానగ్రహీత ఖాధర్‌బాషా మాట్లాడుతూ తమ 50వ పెళ్లిరోజు సందర్భంగా తమను ఎంతో ప్రేమతో ఘనంగా సన్మానించిన సంయుక్త సేవాసంస్థ సభ్యులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. తన చివరి రక్తపుబొట్టు వరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.